# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 166 | విశాఖపట్నం | 18-3-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 166 | VISAKHAPATNAM | 18-3-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## మరో 15 రోజులకు అవసరమైన

# గ్యాస్ నిల్వలు సిద్ధం: చంద్రబాబు

**అమరావతి, పతాకం న్యూస్:** పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో గ్యాస్ సరఫరాపై ప్రభావం పడింది. ఇప్పటికి ఇళ్లలో వాడుకునే సిలిండర్లపై లేకున్నా కమర్షియల్ సిలిండర్ల కొరత కొనసాగుతోంది. అయితే రానున్న రోజుల్లో గ్యాస్ దొరకదేమోనన్న టెన్షన్ మాత్రం ప్రజల్లో ఉంది. దీంతో అందరూ గ్యాస్ సిలిండర్ల కోసం గోడౌన్లు, గ్యాస్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇదిలావుంటే ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా, ప్రజలు ప్యానిక్ కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్స్ లభ్యత పెరిగేలా చూడాలని సూచించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో మరింతగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ విస్తరించే అంశంపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలన్నారు.



సీఎన్‌జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్టంగా పెంచేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఆర్టీజీఎస్ నుంచి గ్యాస్ సరఫరా అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపె నీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ అధికారులు పాల్గొ న్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 14 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలున్నాయి అని సీఎం తెలిపారు. మరికొన్ని మెట్రిక్ టన్నుల గ్యాస్ అందు బాటులోకి రానున్నాయన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు ఎలాంటి కొరతా లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రజలకు తక్షణం (తరువాయి 2వ పేజీలో)

## మధ్యాహ్న భోజనం విషయంలో తప్పు రిపీట్ అయితే

# కఠిన చర్యలు: లోకేశ్



**ఎన్టీఆర్ జిల్లా, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, తప్పు పునరావృతం అయినా కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. చిన్న సమస్య ఉన్నా వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ఈ పవిత్ర బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని ఓ పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనంపై వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మైలవరం దేవునిచెరువు తారకరామా నగర్ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన మంత్రి లోకేశ్, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా తిని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. కొత్త కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని విద్యార్థులు బదులిచ్చారు. వివాదం జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉండేదని కూడా మంత్రి ఆరా తీశారు. భోజనంలో (తరువాయి 2వ పేజీలో)

# అరకొరగా పెదపాడు పాఠశాల భవనం

## కంకర నేలపై పిల్లల చదువులు







- స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడిచిన మారని బతుకులు
- అరకొర చదువులు.. దీనస్థితిలో విద్యార్థులు
- కటికి నేలపై చదువులా?
- విద్యాశాఖ మంత్రికి గారు పట్టించుకోండి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి మావైపు ఒక్కసారి చూడండి
- మా బ్రతుకులు ఇంతేనా మారవా..మార్చరా అండి ..
- సీఎం గారు కనికరించండి.. మంచి భవనం ఏర్పాటు చేయండి సార్ అంటూ విద్యార్థులు ఆవేదన

(పెదపాడు, పతాకం న్యూస్)

అల్లూరి జిల్లా,పెదబయలు మండలం, గిన్నెలకోట పంచాయతీ, పెదపాడు గ్రామంలో పాఠశాల భవనం పూర్తి చేయాలని గ్రామస్తులతో పాటు గిరిజన విద్యార్థి సంఘం,జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద మాధవరావు డిమాండ్ చేశారు. పెదపాడు గ్రామంలో గల మండల ప్రాథమిక పాఠశాలకు సుమారు 26 మంది పిల్లలు చదువుకుంటున్నారు. కానీ పాఠశాల భవనం పూర్తికాక సరైన సదుపాయం లేక పాఠాలు నేర్చుకోలేని దుస్థితిలో ఉన్నాం ఇప్పటికైనా మార్చండి. నేర్చుకోవడానికి పిల్లలు, పాఠాలు చెప్పడానికి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నటువంటి ఘటన కళ్లకు కనిపిస్తుంది.

గ్రామంలో గత ప్రభుత్వం హయాంలో నాడు-నేడులో భాగంగా పాఠశాలకు భవనం మంజూరైంది.కానీ పాఠశాల భవనం పనులను ప్రారంభించి అటు ఇటు కాకుండా మధ్యలోనే వదిలివేయాడంతో పిల్లలు కూర్చోవడానికి కూడా వీలు కాకుండా ఉంది. దీనివలన పిల్లలు చదువుకు దూరమవుతున్నటువంటి పరిస్థితి నెలకొంది. ఎండాకాలంలో ఎండకు, వానకు పిల్లల బాధలు చూడలేని పరిస్థితి. గ్రామంలో వర్షాకాలంలో నాలుగు నెలలపాటు పాఠశాల మూతబడి ఉంటుంది.దానికి గల కారణం గ్రామానికి రహదారి సౌకర్యం లేక వర్షాకాలంలో పాఠశాలకు ఉపాధ్యాయుడు రావాలంటే కొండ వాగు దాటుతూ ప్రాణాలు పణంగా పెట్టి రావాలి.అలాగే గ్రామంలో ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయినా నిత్య అవసరాల సరుకులు తెచ్చుకోవడానికి గాని పండించిన పంటలు సంతలో అమ్మాలన్నకానీ,గర్భిణీ స్త్రీలను హాస్పటల్ కి తీసుకువెళ్లాలన్నా సాహసం చేయాల్సిందే!

దీంతో గ్రామంలో అనారోగ్యం పాలై చాలామంది సరైన సమయంలో ఆస్పత్రికి వెళ్లలేక మరణించినటువంటి బయట ప్రపంచానికి తెలియని ఘటనలు ఎన్నో!!తక్షణమే జిల్లా అధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి పిల్లలు చదువుకోవడానికి పాఠశాల భవనంతో పాటు రహదారి,బ్రిడ్జి పూర్తి చేయాలని గ్రామస్తులతో పాటు గిరిజన విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేసారు. సమస్య పరిష్కారం కాకుంటే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమానికి సిద్ధమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు చంటిబాబు, నాగరాజు, మాధవరావు, గ్రామస్తులు వినాయకరావు, అంజి రావు, అప్పలనాయుడు, చిన్నమ్మి, బొంజునాయుడు, హరి తదితరులు పాల్గొన్నారు.

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# నిబద్ధతను నిలుపుకోవాలి

హైదరాబాద్ శివార్లలోని ఒక ఫాంహౌస్‌లో జరిగిన పార్టీ ఉదంతంతో రాజకీయ పార్టీల నేతలకు, డ్రగ్స్ మాఫియాకు మధ్య పెనవేసుకున్న బలమైన బంధం మరొకసారి బహిర్గతమైంది. తన ఫాంహౌస్‌లో పార్టీని ఏర్పాటు చేసింది బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ రోహిత్‌రెడ్డి, అందులో పాల్గొన్నది ఏలూరు టిడిపి ఎంపీ పుట్టా మహేష్ కుమార్, వ్యాపారులు. తెలంగాణ 'ఈగల్' పోలీసులు పక్కా సమాచారంతో సదరు ఫాంహౌస్‌ను చుట్టుముట్టి నిర్వహించిన సోదాలలో పదకొండు మంది దొరికారు. పార్టీలో నిషేధిత డ్రగ్స్, అనుమతి లేని విదేశీ మద్యం తీసుకోవడం బరితెగింపు కాగా, తనిఖీలు చేయబోయిన పోలీసులపై తుపాకీతో కాల్పులకు తెగబడటం భయానకం. పార్టీలో పట్టుబడ్డ పదకొండు మందికీ రక్త పరీక్షలు నిర్వహించగా ఎం.పి. మహేష్ కుమార్, మాజీ ఎంఎల్ఎ రోహిత్‌రెడ్డితో పాటు ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. వారు డ్రగ్స్ తీసుకున్నారని నిర్ధారణైంది. కానీ పోలీసులు రోహిత్‌రెడ్డి, అతని సోదరుడు రితేష్‌రెడ్డి, ఢిల్లీ వ్యాపారి నమిత్‌శర్మ.. ముగ్గురినీ ఆదివారం రాత్రి జడ్జి ముందు హాజరు పరిచి రెండు వారాల రిమాండ్‌పై జైలుకు తరలించారు. పార్టీలో దొరికిన తతిమ్మా ఎనిమిది మందికీ స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేశారు. ఆ విధంగా వదిలేసిన వారిలో టిడిపి ఎం.పి. మహేష్ ఉండటం గమనార్హం. సంఘటన తెలంగాణాలో జరిగినా అన్ని వేళ్లూ మన రాష్ట్రంలో అధికార టిడిపి వైపే చూపుతున్నాయి. అందుక్కారణం గంజాయి, డ్రగ్స్, సహా మత్తుపదార్థాల కట్టడే కూటమి ప్రభుత్వ లక్ష్యం, నేరస్తుల అంతు చూస్తాం అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి నేతలు నిత్యం చేస్తున్న భీషణ ప్రతిజ్ఞలు. తమ ఎం.పి. డ్రగ్స్ తీసుకున్నారంటూ పక్క రాష్ట్ర పోలీసులు పక్కాగా నిర్థారించి ప్రకటించిన నేపథ్యంలో చంద్రబాబు, కూటమి నేతలు ఏం చర్యలు చేపడతారన్న ప్రశ్నలు తలెత్తాయి. ఒక ఎం.పి. ఈ విధంగా డ్రగ్స్ తీసుకొని పట్టుబడటం దేశ రాజకీయాల్లో మరెక్కడా లేదంటున్నారు. మత్తు పదార్థాలను అరికడతామంటున్న చంద్రబాబు, తొలుత తమ పార్టీలో అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటేనే ఎవరైనా నమ్ముతారు. డ్రగ్స్ కేసులో దొరికిన తమ ఎం.పి.ని పార్టీ నుంచి బహిష్కరించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్న డిమాండ్ సహేతుకమైనది. పార్లమెంట్‌లో చట్టాలు చేసే స్థాయి వ్యక్తి డ్రగ్స్ కేసులో బుక్కయినందున ఎం.పి. పదవికి రాజీనామా చేయించి నిబద్ధత నిలుపుకోవాలి. అనర్హత వేటు వేయాలని లోక్‌సభ స్పీకర్‌కు చంద్రబాబు సిఫారసు చేయాలి. నోటీసులతో సరిపెడితే ప్రజలు విశ్వసించరు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతామంటున్న బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ ఎం.పి. మహేష్‌పై అనర్హత వేటు వేసి మాటకు కట్టుబడాలి. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ప్రభుత్వాలకు తెలీకుండా, ఏలికల అండ లేకుండా జరగదు. కొన్ని పాలక పార్టీ నేతల, మాఫియా మధ్య సంబంధాలతోనే మత్తు నేరస్తులు చెలరేగిపోతున్నారు. చాలా సందర్భాల్లో కేసులు, శిక్షలు ఉండట్లేదు. శిక్షలు పడ్డా నామమాత్రం. ఈ పరిస్థితే మాదక ద్రవ్యాల యథేచ్ఛ రవాణాకు ఊతమవుతోంది. ఎన్నికలకు ముందు కంటైనర్‌లో భారీగా డ్రగ్స్ వచ్చాయని ప్రచారం సాగింది. వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి నడుమ పెద్ద డైలాగ్‌వార్ నడిచింది. చివరికి అవి డ్రగ్స్ కాదని కొన్ని నెలల తర్వాత కేంద్ర సంస్థ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ చల్లగా చెప్పింది. మాఫియాపై ఉక్కుపాదం మోపే చిత్తశుద్ధి ప్రభుత్వానికి నిజంగా ఉంటే నెల్లూరు జిల్లాలో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడిన పెంచలయ్య హత్య జరిగేదా? హత్య తర్వాత కూడా పరిస్థితి మారలేదు. మహిళలు, మైనర్ బాలికలపై లైంగిక అఘాయిత్యాలు, దొమ్మీలు, మారణాయుధాలతో వీధుల్లో స్వైర విహారాలు, రోడ్డు ప్రమాదాలు.. సమస్త నేరాలకూ మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలే హేతువులు. ఉగ్రవాదాన్ని తలదన్నేలా మత్తు మాఫియా తయారు కావడం ఆందోళనకరం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఈ మత్తు నేరాలను అణచివేయాలంటే ముందుగా నేరస్తులను రాజకీయ పార్టీలు తమ దరి చేరనీయమని ప్రతిజ్ఞ చేసి, దాన్ని అమలు చేసి నైతికతను నిరూపించుకోవాలి.

## ఎల్పీజీ కేవైసీపై కేంద్రం కీలక ప్రకటన.. ఎల్‌పీజీ వినియోగదారులకు ఊరట



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్‌కు మళ్లీ ఈ-కేవైసీ చేయించాలంటూ వస్తున్న వార్తలపై నెలకొన్న గందరగోళానికి కేంద్ర ప్రభుత్వం తెరదించింది. ఈ-కేవైసీ ప్రక్రియ అందరికీ తప్పనిసరి కాదని, కేవలం కొందరికి మాత్రమేనని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసి వినియోగదారుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించే ప్రయత్నం చేసింది. ఇప్పటికే కేవైసీ పూర్తి చేసుకున్న సాధారణ వినియోగదారులు మళ్లీ ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం లేదని కేంద్రం తెలిపింది. కేవలం ఇప్పటివరకు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ (ఈ-కేవైసీ) పూర్తి చేయని వారు, ప్రధానమంత్రి ఉజ్వల యోజన (గ్రావీఖ్) లబ్ధిదారులు మాత్రమే దీన్ని చేయాల్సి ఉంటుందని వివరించింది. ఉజ్వల పథకం కింద కనెక్షన్ పొందిన వారు సబ్సిడీ ప్రయోజనాలు కొనసాగడానికి ప్రతి ఆర్థిక సంవత్సరం తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా 7 సిలిండర్ల తర్వాత 8, 9వ సిలిండర్ రీఫిల్‌పై సబ్సిడీ పొందడానికి ఇది అవసరమని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి మీదుగా ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రభావంతో దేశంలో ఎల్‌పీజీ నిల్వలు తగ్గడంతో కేంద్రం వాణిజ్య సిలిండర్లపై ఆంక్షలు విధించి గృహ వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చింది. సిలిండర్ల బ్లాక్ మార్కెట్‌ను నిరోధించేందుకు బుకింగ్ గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇందులో భాగంగానే ఈ-కేవైసీపైనా ఆదేశాలు జారీ చేయడంతో వినియోగదారులందరూ మళ్లీ కేవైసీ చేయించాలనే అపోహతో గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరారు. ఈ-కేవైసీ ప్రక్రియను వినియోగదారులు తమ ఇళ్ల నుంచే ఆన్‌లైన్‌లో ఉచితంగా పూర్తి చేసుకోవచ్చని మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల పారదర్శకత పెరగడమే కాకుండా నకిలీ కనెక్షన్లను గుర్తించడం, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడం సులభమవుతుందని వివరించింది. ఎలాంటి అంతరాయం లేకుండా సిలిండర్ల సరఫరా జరుగుతుందని హామీ ఇచ్చింది. మొత్తం మీద, కేంద్రం చేసిన ఈ తాజా ప్రకటనతో గ్యాస్ వినియోగదారుల్లో నెలకొన్న ఆందోళన, గందరగోళానికి తెరపడినట్లయింది.

## కాఫీ గింజలను జీసీసీ కొనుగోలు చేయాలి



**చింతపల్లి, పతాకం న్యూస్:** ఆదివాసీ రైతులు పండించిన కాఫీ చెర్రీ గింజలను గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. యర్రబొమ్మలు పంచాయతీ యర్రబంద గ్రామంలో ఆదివాసీ కాఫీ రైతులతో కలిసి గిరిజన సంఘం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భగా సాగిన చిరంజీవి మాట్లాడుతూ కొంత కాలంగా జీసీసీ గిరిజన రైతులు పండించిన కాఫీ గింజలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. కాఫీ సీజన్ ప్రారంభంలో గిరిజనులు పండించిన కాఫీ గింజలు పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని, ప్రైవేటు వ్యాపారులకు విక్రయించవద్దని జీసీసీ ఉద్యోగులు రైతుల ఇళ్లకు వచ్చి హామీ ఇచ్చారన్నారు. ఈ ఏడాది జీసీసీ అపెక్స్ కమిటీ సిఫారసు మేరకు కాఫీ పార్చిమెంట్ కిలో రూ.450, చెర్రీ రూ.270 ధరలుగా నిర్ణయించిందన్నారు. జనవరి నెలాఖరు వరకు మాత్రమే రైతుల నుంచి తక్కువ పరిమాణంలో కాఫీ గింజలను జీసీసీ కొనుగోలు చేసిందన్నారు. ఫిబ్రవరి నుంచి కాఫీ గింజల కొనుగోలును జీసీసీ నిలిపివేసిందని చెప్పారు. దీంతో రైతులు కాఫీ గింజలను అమ్ముకోకుండా ఇళ్లలో భద్రపరుచుకుని జీసీసీ ఎప్పుడు కొనుగోలు చేస్తుందా? అని ఎదురుచూస్తున్నారని చెప్పారు. చింతపల్లి మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వెంటనే జీసీసీ కాఫీ గింజలు కొనుగోలు చేయాలని తీర్మానం చేసి కలెక్టర్, జీసీసీ ఎండీకి పంపించినప్పటికి అధికారుల్లో చలనం కనిపించడం లేదన్నారు. వారం రోజుల్లో జీసీసీ అధికారులు రైతుల నుంచి కాఫీ గింజల కొనుగోలును పునఃప్రారంభించాలన్నారు. అధికారులు స్పందించకపోతే చింతపల్లి జీసీసీ డీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణమూర్తి, కాఫీ రైతులు పాల్గొన్నారు.

## కారు బోల్తాపడి ఒకరు మృతి..



**తిరుపతి, పతాకం న్యూస్:** లారీని తప్పించబోయి కారు బోల్తాపడి ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మంగళవారం తిరుపతి జిల్లాలోని చంద్రగిరి హైవేపై జరిగింది. చంద్రగిరి కోట సమీప మెయిన్ రోడ్ లో హైవేపై లారీని తప్పించబోయిన కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న బంగారుపాళ్యం మండలం గుంతూరు గ్రామానికి చెందిన జేసీబీ నరేంద్ర, మడుపోలూరు సురేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని గాయపడినవారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆ ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. చికిత్స పొందుతూ నరేంద్ర మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 'లక్షకు నెలకు పది వేలు' అంటూ గాలం.. కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన నవ్యశ్రీ వారాహి బిజినెస్ కన్సల్టెన్సీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** "లక్ష రూపాయలు కడితే చాలు. నెలకు పది వేల చొప్పున ఇస్తాం. కేవలం 20 నెలల్లో మీ డబ్బు రెట్టింపు అవుతుంది" అంటూ ఆకర్షణీయమైన మాటలు చెప్పి వందల మందికి ఓ ప్రైవేట్ సంస్థ కుచ్చుటోపీ పెట్టింది. గుంటూరులో జరిగిన ఈ ఘరానా మోసం మంగళవారం వెలుగులోకి వచ్చింది. ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన నిర్వాహకులు రాత్రికి రాత్రే బోర్డు తిప్పేశారు. దీంతో నడిరోడ్డున పడ్డామని బాధితులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ భారీ మోసానికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరులోని అరండల్‌పేట్ 16వ లైన్లో ఈ మోసం జరిగింది. అక్కడ 'నవ్య శ్రీ వారాహి బిజినెస్ కన్సల్టెన్సీ' పేరుతో ఒక ఆఫీసు వెలిసింది. అన్నం వెంకట పూర్ణచంద్రరావు అనే వ్యక్తి మరికొందరితో కలిసి దీనిని ప్రారంభించాడు. సంస్థ తరఫున ఒక స్కీమ్ ప్రకటించాడు. లక్ష రూపాయలు ఇస్తే, వాటితో షేర్ మార్కెట్లో ట్రేడింగ్ చేస్తామని నమ్మించాడు. ఆ లాభాల్లో నెలకు రూ. 10 వేలు చొప్పున 20 నెలల పాటు చెల్లిస్తామని ఆశ చూపాడు. వ్యాపారంలో ఏమైనా నష్టాలు వస్తే ఆ భారం కూడా తానే భరిస్తానని పూర్ణచంద్రరావు చెప్పేవాడు. నమ్మకం కలగడానికి చెక్కులు, బాండ్లు కూడా రాసిచ్చాడు. ఆఫీసు పెట్టినప్పటి నుంచి దాదాపు 23 నెలల పాటు కొంతమందికి క్రమం తప్పకుండా డబ్బులు చెల్లించాడు. దీంతో జనాలకు సంస్థపై నమ్మకం పెరిగింది. చాలామంది తమ ఆస్తులు తాకట్టు పెట్టారు. మరికొందరు అప్పులు తీసుకొచ్చి మరీ ఇక్కడ కట్టారు. లాభాలు వస్తున్నాయని తమ బంధువుల చేత కూడా భారీగా డిపాజిట్లు చేయించారు. ఇలా వందల మంది నుంచి కోట్లు వసూలు చేశారు. కొన్నాళ్లకు అసలు రంగు బయటపడింది. జనవరి నుంచి చెల్లింపులు ఆగిపోయాయి. నిలదీసిన వారికి బ్యాంకు సమస్యలు ఉన్నాయని మాయమాటలు చెప్పారు. వ్యాపారంలో నష్టాలు వచ్చాయని మరికొందరితో అన్నారు. ఏప్రిల్ కల్లా మొత్తం డబ్బులు చెల్లిస్తానని నమ్మించారు. తీరా మార్చి 13వ తేదీన ఎవరికీ చెప్పకుండా నిర్వాహకులు ఆఫీసుకు తాళం వేసి పరారయ్యారు. మోసపోయామని గ్రహించిన బాధితులు వెంటనే అరండల్?పేట పోలీసులను ఆశ్రయించారు. సంస్థ నిర్వాహకులపై ఫిర్యాదు చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## గ్యాస్ నిల్వలు సిద్ధం: చంద్రబాబు

అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలన్నారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇదిలా ఉండగా మరోవైపు ఎల్పీజీ సిలిండర్లు బ్లాక్ మార్కెట్?కు తరలిపోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతి వినియోగదారుడి నుంచి ఓటీపీ తీసుకునే విధానాన్ని అవలంభించడం ద్వారా డొమెస్టిక్ సిలిండర్లు దుర్వినియోగం కాకుండా చూస్తున్నామని అధికారులు చెప్పారు. హెచ్?పీసీఎల్ సంస్థ 90 శాతానికి పైగా ఓటీపీలతోనే గ్యాస్ సరఫరా చేస్తోందని ఆ తర్వాత స్థానాల్లో బీపీసీఎల్, ఐఓసీఎల్ ఉన్నాయని అధికారులు తెలిపారు. ఓటీపీల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల ద్వారా సమన్వయం చేసుకుంటూ ఆర్టీజీఎస్ నుంచి సాంకేతిక సాయాన్ని ఆయా గ్యాస్ సరఫరా కంపెనీలకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు. గ్యాస్ డెలివరి విషయంలో సిలిండర్లు దుర్వినియోగం కాకుండా టెక్నాలజీని ఉపయోగించి పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో సాధారణ పరిస్థితుల్లో ఒకటిన్నర రోజుల్లోనే డెలివరి జరిగేదని కానీ ఇప్పుడు రెండున్నర రోజులు పడుతుందని అధికారులు వెల్లడించారు. గతంతో పోల్చుకుంటే రీఫిల్ బుకింగ్ గడవు పెరిగిందని ఇలాంటి సమయంలో గతంలో మాదిరిగానే డెలివరిని ఒకటిన్నర రోజుల్లోనే అందించగలిగితే ప్రజల్లో గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన ఉండదని సూచించారు. ఎల్పీజీ సరఫరా విషయంలో ప్రజల్లోని ఆందోళనలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లు వంటి వాటిల్లో కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇక ఎల్పీజీ వినియోగం తగ్గించుకునేలా హోటళ్ల అసోసియేషన్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరపాలని సూచించారు. అలాగే ఓఎన్జీసీ, గెయిల్, బీజీఎల్ వంటి సంస్థలతో ఇంటింటికీ గ్యాస్ పైప్ లైన్ కనెక్షన్లు ఇచ్చే సంస్థలు సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఈ క్రమంలో గ్యాస్ పైప్ లైన్ల విస్తరణకు అవసరమైన చర్యలపై దృష్టి సారించాలని అన్నారు. ఇండక్షన్ స్టవ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులకు సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రాలకు త్వరలోనే మరింత ఎల్పీజీ కేటాయింపులను కేంద్రం చేయనున్నట్లు అధికారులు సీఎం వెల్లడించారు. వివిధ ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యల పైనా అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## కఠిన చర్యలు: లోకేశ్

ఏమైనా సమస్యలుంటే ముందుగా తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఇకపై భోజనం నాణ్యతపై 'లీప్' యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని, మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యతను పరిశీలిస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం అధికారులతో మాట్లాడిన మంత్రి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని గట్టిగా హెచ్చరించారు. "మీపై పవిత్ర బాధ్యత ఉంది. విద్యార్థులకు సంబంధించి చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, వెంటనే పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు. భోజనం నాణ్యతపై ప్రతి వారం ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలోని రికార్డులు, విద్యాబోధన తీరును పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మధ్యాహ్న భోజనంపై నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి గుర్తుచేశారు. సమూల మార్పుల కోసం రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తామన్నారు. వారంలో ఒకరోజు స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు.

# ముగిసిన జీవీఎంసీ పాలకవర్గం పదవీ కాలం..




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. జీవీఎంసీకి 2021 మార్చి 14న ఎన్నికలు జరగ్గా, అదే నెల 18న కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఐదేళ్ల పదవీకాలం మంగళవారం నాటికి పూర్తవుతుండడంతో కార్పొరేటర్లంతా మాజీలు కాబోతున్నారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యేసరికి జీవీఎంసీకి తిరిగి ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు వంటివి ఉండడం వల్ల వెంటనే ఎన్నికలు నిర్వహించడానికి అవకాశం లేకుండాపోయింది. పరీక్షల సీజన్‌ముగిసినప్పటికీ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కులగణన ప్రారంభించడంతో రెండు, మూడు నెలల్లో ఆ కార్యక్రమంతో పాటు రిజర్వేషన్ల ఖరారు కూడా కొలిక్కివస్తుందని భావిస్తున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే స్థానిక సంస్థలకు ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల ప్రకటించారని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలతో పాటు జీవీఎంసీలో వచ్చే ఆరు నెలల్లో కొత్తపాలకవర్గం కొలువుదీరుతుందని అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు జీవీఎంసీలో భీమిలి మండలంలోని మిగిలిన గ్రామాలతోపాటు ఆనందపురం, పద్మనాభంలోని 72 గ్రామాలు, పెందుర్తి మండలంలోని మిగిలిన గ్రామాలను విలీనం చేయాలనే ప్రతిపాదన ఉంది. దీనిపై పెందుర్తి, భీమిలి ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి లేఖ రాయగా, విలీనంపై పరిశీలించి నివేదిక పంపించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. జీవీఎంసీ అధికారులు విలీనానికి సాధ్యాసాధ్యలను పరిశీలించాల్సి ఉంటుంది. ఒకవేళ ఎమ్మెల్యేల విజ్ఞప్తి మేరకు ఆయా గ్రామాల విలీనానికి అనుకూలంగా అధికారులు నివేదిక పంపిస్తే మాత్రం జీవీఎంసీకి ఎన్నికలు ఆలస్యం అవుతాయని జీవీఎంసీ అధికారులతోపాటు ప్రస్తుత కార్పొరేటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు.

# అనసూయ దేవికి ఘన సత్కారం





SATHYABAMA INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY (DEEMED TO BE UNIVERSITY)

No. NP 263

Association of Indian Universities

AIU HOUSE, 16, COMRADE INDRAJIT GUPTA MARG, NEW DELHI 110002

Certificate of Participation

This is to certify that Y ANASUYA DEVI

representing ANDHRA UNIVERSITY

participated in the 'Kalai Saaral' 39th AIU Inter-University National Youth Festival 2025-26 (UNIFEST) hosted by Sathyabama Institute of Science and Technology, Chennai, Tamil Nadu from 10th to 14th March 2026 as TEAM MANAGER

Manisha Niraj, Organising Secretary | Dr. G. Sundari, Registrar, SIST | Dr. (Mrs). Pankaj Mittal, Secretary General, AIU

**మల్కాపురం, పతాకం న్యూస్ :** ఈనెల 10వ,తేదీ నుండి 14వ తేదీ వరకు భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం మరియు సత్యభామ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో చెన్నైలో జాతీయ స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. ఈ ఉత్సవాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయ టీముకు మేనేజర్ గా వ్యవహరించి, విద్యార్థులు విజయాలు సాధించేలా చూసిన సెయింట్ ఆన్స్ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు మరియు జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వై.అనసూయ దేవిని పలువురు విద్యావేత్తలు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ యువజన ఉత్సవాలలో 142 విశ్వవిద్యాలయాల నుండి సుమారు 3000 మంది విద్యార్థులు అనేక అంశాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. అనసూయ దేవి నాయకత్వంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ టీం కు చెందిన కుమారి పి. వేలంగిణి రంగోలి పోటీలో ద్వితీయ స్థానాన్ని, శ్రీ వికాస్ కుమార్ వక్తృత్వ పోటీలో నాలుగవ స్థానాన్ని పొంది,ట్రోఫీని, మెడల్ ను, ప్రశంసా పత్రాలను కైవసం చేసుకున్నారు.టీము మేనేజర్ గా అనసూయదేవి కూడా ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి,జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ఆంధ్ర విశ్వవిద్యాలయ అధికారులు అనసూయ దేవిని అభినందించారు.

# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

## దేవరాపల్లిలో విద్యార్థుల నిరసన



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అనే నినాదంతో మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం రాత్రి విద్యార్థులు ప్లే కార్డ్స్ చేతపట్టి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న మాట్లాడుతూ ఇరాన్ ఇజ్రాయిల్ దేశాల మధ్య జరిగిన యుద్ధం కారణంగా నిత్యవసర ధరలు, చమురు ధరలు పెరిగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధం పేరుతో గ్యాస్ కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి టి దొర తదితరులు పాల్గొన్నారు.

# అరకులోయలో వంటగ్యాస్‌కు క్యూ



**అరకులోయ, పతాకం న్యూస్:** అరకులోయలో వంట గ్యాస్ సమస్య తీవ్రరూపం దాల్చింది. మాడుగుల, ఎస్.కోటల నుంచే వచ్చే గ్యాస్‌వ్యాన్‌ల కోసం తెల్లవారు జాము నుంచే రోడ్లపై వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు. ఎస్.కోట నుంచి వచ్చిన భారత్ గ్యాస్ వ్యాన్‌ను బోసుబెడ్డలో వినియోగదారులు బలవంతంగా నిలిపివేసి, సిలిండర్లను విడిపించుకున్నారు. అదేవిధంగా మాడుగుల నుంచి వచ్చిన భారత్ గ్యాస్ వ్యాన్ ఉదయం 6 గంటలకే అరకులోయకు చేరుకుంది. దీంతో వినియోగదారులంతా క్యూ కట్టారు. ఇంతవరకు అరకులోయలో వినియోగదారులు ఈకేవైసీ చేయించకుండా గ్యాస్ సిలిండర్లను పొందేవారు. ప్రస్తుతం వంట గ్యాస్ కొరత రావడంతో ఈకేవైసీ చేయించుకున్నవారికే సిలిండర్లు ఇస్తామని సిబ్బంది చెప్పడంతో వినియోగదారులు గంటల తరబడి క్యూలో ఉన్నారు. ఈకేవైసీ అనంతరం సిలిండర్లను వినియోగదారులకు ఇచ్చారు. క్యూలో ఉన్న వారందరికీ గ్యాస్ సిలిండర్లు అందడంతో గొడవలకు ఆస్కారం లేకుండా పోయింది.కమర్షియల్ వంట గ్యాస్ సిలిండర్లు నిలిపివేతతో చిరు వ్యాపారులు, చిన్న హోటళ్లు వారు ఆందోళన వ్యక్తం చేశారు. కమర్షియల్ సిలిండర్లు లేకపోవడంతో టీకొట్లు, టిఫిన్ సెంటర్లు, భోజన హోటళ్లు మూతపడ్డాయి. కమర్షియల్ సిలిండర్లు ఎందుకు తీసుకురాలేదంటూ గ్యాస్ ఏజెన్సీ వారిని చిన్న వ్యాపారులు నిలదీశారు.

# నేడు తెలుగు జర్నలిస్ట్ ఫోరం ఉగాది సంబరాలు

## జర్నలిస్టుల ఉనికి, సామర్థ్యానికి వేదిక




**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** తెలుగు జర్నలిస్ట్ ఫోరం (టీ జే ఎఫ్) ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నేడు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకలు కేవలం పండుగ ఉత్సాహానికే కాకుండా, జర్నలిస్టుల ఐక్యత, ఉనికి, వృత్తి సామర్థ్యాన్ని చాటిచెప్పే వేదికగా నిలవనున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఒకే వేదికపై సీనియర్, యువ జర్నలిస్టులు కలుసుకోవడం ద్వారా వృత్తి ఐక్యతకు బలమైన సందేశం వెళ్లనుంది. సమాజానికి సమాచారాన్ని అందించే వారిగా మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య పరిరక్షకులుగా తమ బాధ్యతను గుర్తుచేసుకునే వేదికగా ఈ కార్యక్రమం మారనుంది. ఈ ఉగాది వేడుకల నిర్వహణలో చూపుతున్న ప్రణాళిక, సమన్వయం తెలుగు జర్నలిస్ట్ ఫోరం దినదినాభివృద్ధికి నిదర్శనంగా భావిస్తున్నారు. సభ్యుల సమీకరణ, కార్యక్రమాల రూపకల్పన, నిర్వహణలో ఉన్న క్రమబద్ధత సంస్థ పరిపక్వతను తెలియజేస్తోంది. ఈ సంస్థ అభివృద్ధి వెనుక స్థాపకుడు ఈశ్వర్ చౌదరి నిరంతర శ్రమ, దూరదృష్టి కీలక పాత్ర పోషించాయి. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తి అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి వల్లే టి జె ఎఫ్ నేడు విస్తృత స్థాయిలో ఎదిగింది. ఈ కార్యక్రమం ద్వారా ఆయన నిర్మించిన వేదిక బలం మరోసారి వెలుగులోకి రానుంది. ప్రస్తుతం మీడియా రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో, ఇలాంటి వేదికలు జర్నలిస్టులకు మానసిక బలం, పరస్పర మద్దతు అందిస్తున్నాయి. ఉగాది వంటి పండుగల సందర్భాన్ని ఉపయోగించుకుని జర్నలిస్టులు తమ అనుబంధాన్ని బలోపేతం చేసుకోవడం, వృత్తి విలువలను పునరుద్ఘాటించడం ముఖ్యమైన అంశంగా భావించవచ్చు. ఈ కార్యక్రమం జర్నలిస్టుల సామర్థ్యాన్ని సమాజానికి తెలియజేసే అవకాశంగా నిలుస్తుంది. నేడు జరగబోయే తెలుగు జర్నలిస్ట్ ఫోరం ఉగాది సంబరాలు జర్నలిస్టుల ఐక్యత, సామర్థ్యం, సామాజిక బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తాయని ఆశిస్తున్నారు. భవిష్యత్తులో ఈ వేదిక మరింత బలపడుతూ జర్నలిజం రంగంలో కీలక పాత్ర పోషించనుంది.

# ముగిసిన నర్సీపట్నం మున్సిపాల్టీ పాలకవర్గం పదవీ కాలం




**నర్సీపట్నం, పతాకం న్యూస్:** పురపాలక సంఘానికి ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల అనంతరం ఏర్పడిన పాలకవర్గం పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దీంతో బుధవారం నుంచి చైర్‌పర్సన్‌తోసహా కౌన్సిలర్లందరూ మాజీలు కానున్నారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం మేజర్ పంచాయతీలను కలిసి 2011లో ప్రభుత్వం నర్సీపట్నం మునిసిపాలిటీని ఏర్పాటు చేసింది. 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో టీడీపీకి మెజారిటీ స్థానాలు రావడంతో అధికార పగ్గాలు చేపట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన 2021 మార్చి 10న రెండోసారి జరిగిన ఎన్నికలో ఆ పార్టీ పాగా వేసింది. 28 వార్డులకుగాను వైసీపీ 14, టీడీపీ 12, జనసేన 1, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానంలో గెలిచారు. మార్చి 18న పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. చైర్‌పర్సన్ పదవికి గుడబండి ఆదిలక్ష్మి, బోడపాటి సుబ్బలక్ష్మి పోటీ పడగా, నాటి ఎమ్మెల్యే గణేశ్ వీరిమధ్య రాజీ చేశారు. ఇరువురు చెరో రెండు సంవత్సరాలు, చివరి సంవత్సరం స్వతంత్ర కౌన్సిలర్ చెక్కా బాలమ్మకి చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. అయితే కొన్ని కారణాల వల్ల బాలమ్మకి చైర్‌పర్సన్ పదవి దక్కలేదు. తొలి రెండేళ్లు చైర్‌పర్సన్‌గా గుడబండి ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్ -1గా గొలుసు నరసింహమూర్తి, వైస్ చైర్మన్-2గా తమరాన అప్పలనాయుడు, తరువాత చైర్‌పర్సన్‌గా బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్-1గా కోనేటి రామకృష్ణ పదవీ ప్రమాణం చేశారు. చైర్‌పర్సన్-2 పదవిలో తమరాన అప్పలనాయుడు ఐదేళ్లు కొనసాగారు.

# భూ బకాసురులకు అండ దండలు పలుకుతున్న ఎమ్మార్వో!

## ఫిర్యాదు దారునికి తప్పుడు ఎండార్స్మెంట్ ఇచ్చిన తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకన్న డిమాండ్



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** నాలుగు సర్వే నెంబర్లుకు పీజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే ఒక్క సర్వే నెంబరుకే ఎండార్స్మెంట్ ఇచ్చి పిర్యాదు దారునికి తప్పుడు ఎండార్స్మెంట్ ఇచ్చిన దేవరాపల్లి తహశీల్దార్ ఉన్నతాధి కారులను తప్పుదావ పట్టిస్తున్న ఎమ్మార్వో పై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్. భూకబ్జా దార్లును రక్షించే ప్రయత్నశీ చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న ఎద్దేవా చేశారు. దేవరాపల్లి రెవెన్యూ లో సర్వే నెంబరు 280,280/1 ,281/1,281/2 లో గల ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని తేదీ,8-12-2025 న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు పీజిఆర్ఎస్ లో పిర్యాదు చేస్తు వీటి యెక్క కాపీలను రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేష్ కు ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ కు సిసీఎల్ఎ పంపించడం జరిందని పేర్కొన్నారు దీనిపై తహశీల్దార్ దర్యాప్తు జరిపి సర్వే నెంబరు 281/2 గల భూమి కోర్టు వివవాదంలో ఉందని ఫలసాయం తీసు కోవడానికి కోర్టు ఆర్డర్ ఉందని ఇందులో ఎటువంటి గెస్ట్ హోసులు నిర్మాణం చేయ లెదనీ అక్రమణ దారుని చేయవద్దని చేప్పడం జరిందని ఎండార్స్మెంట్ పేర్కొన్నారని తెలిపారు నిజానికి 281/2 గల భూమి కోర్టు వివాదంలో లెదన్నారు రెవెన్యూ రికార్డులలో లేని భూమి సర్వే నెంబర్లు 281/2 ఘా మాత్రమే కోర్టు వివాదం ఉంద న్నారు,మిగిలిన సర్వే నెంబర్లు 280,280/1,281/1, గల భూములు ఏవి కోర్టు వివాదంలో లేవన్నారు, తహశీల్దార్ 281/2 కూ మాత్రమే ఎండార్స్మెంట్ ఇచ్చి అటు ఉన్నతాధి కారులను ప్రభుత్వన్ని ఇటు పిర్యాదు దారునిని తప్పు త్రోవ పట్టించారని తెలిపారు దీన్నిబట్టి చూస్తే తహశీల్దార్ ప్రజలు సమస్యలు పట్ల ప్రభుత్వ భూములు రక్షించడం లోను ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో స్పష్టంగా అర్ద మౌతుందని అన్నారు ఇటువంటి అదికారులు వలన ప్రభుత్వానికి పూర్తిగా చెడ్డ పేరు రావడంతో పాటు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్లు నిర్వ హిస్తున్న పీజిఆర్ఎస్ పై పూర్తిగా ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపారు వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని తప్పుడు ఎండార్స్మెంట్ లు ఇచ్చి ఉన్నతాధి కారులను పిర్యాదు దారుని తప్పుత్రోవ పట్టించిన తహశీల్దార్ పై చర్యలు తీసు కోవాలని వెంకన్న డిమాండ్ చేసారు

# జనావాసాల మధ్య బాణసంచా నిల్వపై గణబాబు ఆగ్రహం



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** జివిఎంసి 89వ వార్డు పరిధి ఆదర్శనగర్‌లో జరిగిన భారీ పేలుడు ఘటనపై ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పోలీసులు నిల్వలను తొలగించినప్పటికీ, రహస్యంగా వేరొక చోట బాణసంచా దాచి ఉంచడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ప్రమాదకరమైన నిల్వల గురించి పొరుగువారు లేదా స్థానికులు వెంటనే పోలీసులకు లేదా అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని, ఆస్తి నష్టాన్ని అంచనా వేసి బాధితులకు ప్రభుత్వం తరపున తగిన సహాయం అదేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇలాంటి ప్రమాదకర నిల్వలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమేష్, జోనల్ కమిషనర్ హేమావతి, సిఐ సన్యాసి నాయుడు, క్లూస్ టీమ్, పోలీస్, ఫైర్, రెవెన్యూ సిబ్బంది, కార్పొరేటర్ దాడి రమేష్, బొడ్డేటి విజరు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు పల్లా శంకుస్థాపన



**గాజువాక, పతాకం న్యూస్:** జివిఎంసి 65వ వార్డులో సుమారు రూ.2.20 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడుతో కలిసి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు భానోజీతోట వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వందలాది కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. జివిఎంసి పరిధిలో అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యతను కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా ఇండోర్ స్టేడియం ఆధునీకరించామని, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణంతో పాటు మెట్ల మార్గాలను, తాగునీటి పైపులైను నిర్మాణం, వీధి రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మించామని చెప్పారు. గాజువాక ఒక మోడల్ పట్టణంగా రూపుదిద్దుకోనుందని, ఇందుకోసం సమగ్ర ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు టిడిపి అధ్యక్షుడు రట్టివాసు, బైపిల్లి గాంధీ, వార్డు మహిళా అధ్యక్ష, కార్యదర్శులు కోరుకొండ మంగ, కోట్నీ లక్ష్మి, కూటమి నాయకులు రెయ్యి రత్నశీ, అంగకృష్ణ, కర్రి కృష్ణ పాల్గొన్నారు.

# పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం ఉండాలి.. కేంద్రానికి సుప్రీం కోర్టు సూచన



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక మూడు నెలలలోపు వయసున్న పిల్లల్ని దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే 12 వారాల మాతృత్వ సెలవులను కేటాయించడం సరికాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ మేరకు సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దత్తత తీసుకున్న పిల్లల వయసుతో సంబంధం లేకుండా తల్లులకు 12 వారాల మాతృత్వ సెలవులు మంజూరు చేయాలని స్పష్టం చేసింది.

## రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించొద్దు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** గిరిశిఖర గ్రామాల్లో పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. పనుల్లో పురోగతి లేకుండా పొంతనలేని వివరాలు ఇస్తే.. ఊరుకోబో మన్నారు. గిరిజనులకు డోలీ మోతలు తప్పించాలనే లక్ష్యంతో శరవేగంగా రహదారుల పనులు చేపట్టాలని ఆయన ఆదేశించారు.. నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పనుల ఫొటోలు, వివరాలను అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పంచాయతీరాజ్ ఈఈలు, ఏఈలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సీఎస్‌సీ) పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. రోజువారీ పనుల ప్రగతిని వివరించాలన్నారు. ఒక్క పని కూడా పెండింగ్‌లో ఉండకూడదని తెలిపారు. అన్ని నిర్మాణాలు సమాంతరంగా సాగాలని ఆదేశించారు. ప్రతి అధికారికీ ఒక స్పష్టమైన ప్రణాళిక, వ్యూహం ఉండాలని తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా ప్రజలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించి జిల్లాకు 81 స్టాండింగ్ బోర్డులు మంజూరయ్యాని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బోర్డును ఆవిష్కరించారు. ఈ బోర్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ లేదా వాట్సాప్ నెంబర్ 95523 00009 ద్వారా ప్రజలు ఒక్క మెసేజ్‌తో దాదాపు 300కు పైగా ప్రభుత్వ సేవలను పొందొచ్చని కలెక్టర్ తెలిపారు. గ్రామ, వార్డు సచివాల యాలు, బస్టాండ్లు, జనసమూహ ప్రాంతాల్లో ఈ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో కె.బాల్‌మాన్‌సింగ్ , ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాఫీ ఆకుల సేకరణకు ఐటీడీఏ అనుమతి



**చింతపల్లి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా ఒక మండలంలో కాఫీ ఆకులు సేకరించేందుకు ఐటీడీఏ అనుమతించిందని గ్రీన్ ఆయూష్ సీఈవో పులి రాజేశ్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ దినేశ్‌కుమార్‌తో కాఫీ ఆకుల సేకరణపై సోమవారం చర్చించామని, కలెక్టర్ పలు సూచనలు చేశారన్నారు. ఆదివాసీ కాఫీ రైతులకు ఆకుల ద్వారా ఉపాధి కల్పించేలా ఐటీడీఏతో ఒప్పందం కుదుర్చుకునేందుకు కలెక్టర్‌ను కలిశామని, తొలివిడతగా ఏజెన్సీ పదకొండు మండలాల్లో ఒక మండలాన్ని కాఫీ ఆకుల సేకరణకు అనుమతించాలని ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వర్లును కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. ఐటీడీఏ కేటాయించిన మండలంలో రైతుల నుంచి కాఫీ ఆకులను సేకరించి లీఫ్ కాఫీ తయారీకి పంపిస్తామన్నారు. ప్రస్తుతం చింతపల్లి మండలంలోని రైతుల నుంచి సేకరించిన కాఫీ ఆకులతో 50 వేల లీఫ్ కాఫీ యూనిట్లు సిద్ధం చేశామన్నారు. అధిక మొత్తంలో లీఫ్ కాఫీని ఉత్పత్తి చేసేందుకు ఐటీడీఏతో ఒప్పందం కుదుర్చుకుంటామని తెలిపారు. కిలో కాఫీ ఆకులకు రైతులకు రూ.17.28 ధర చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఆయూష్ ప్రతినిధులు కనకరాజు, బుజ్జిబాబు, షేక్ రజక్ పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి



**నిజామాబాద్, పతాకం న్యూస్:** నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందల్వాయి మండలంలోని గన్నారం శివారులో ఉన్న బ్రహ్మంగారి ఆలయం సమీపంలో 44వ జాతీయ రహదారిపై టూరిస్ట్ బస్సు అర్ధరాత్రి 2 గంటల సమయంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందగా.. పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టూరిస్ట్ బస్సు వేగంగా ప్రయాణిస్తుండగా.. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో బస్సు ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదం గన్నారం గ్రామ శివారులోని బ్రహ్మంగారి ఆలయం దగ్గర చోటుచేసుకుంది. ఈ ఘటన జరిగిన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, అత్యవసర సేవలకు సమాచారం అందించారు. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. బస్సు బోల్తా పడిన సమయంలో తీవ్ర గాయాల కారణంగా వారు మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## రైతుల సంక్షేమమే లక్ష్యం: మంత్రి సంధ్యారాణి



**సాలూరు, పతాకం న్యూస్:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరు మండలం మామిడిపల్లి గ్రామంలో 'రైతన్నా- మీ కోసం ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నదాతల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద అర్హులైన ప్రతి రైతు ఖాతాల్లో మూడు విడతలుగా ప్రభుత్వం నగదు జమ చేసిందన్నారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం వ్యవసాయానికి సంబంధించిన పథకాలను వివరించారు.

## శిక్ష పడుతుందేమోనన్న భయంతో ఆత్మహత్య చేసుకున్న యువకుడు



**భోగాపురం, పతాకం న్యూస్:** తన భార్య మృతి కేసులో తనకు శిక్ష పడుతుందేమోనని భయంతో లింగాలవలస గ్రామానికి చెందిన కనకల రామారావు(27) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక సీఐ దుర్గాప్రసాదరావు, ఎస్ఐ పాపారావు అందించిన వివరాల ప్రకారం.. లింగాలవలసకు చెందిన కనకల రామారావు అదే గ్రామానికి చెందిన అప్పటికే భర్తను కోల్పోయిన కనకల మధులక్ష్మిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికీ ఒక కుమార్తె ఉంది. అయితే 2024 నవంబరు 27న మధులక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. అదనపు కట్నం, అనుమానంతో తన కుమార్తెను వేదించ డంతోనే మృతి చెందిందని అప్పట్లో మృతురాలి తల్లి కాల్ల పైడమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేసి, రామారావును రిమాండుకు తరలించారు. కొంత కాలం జైల్లో ఉన్న రామారావు ఇటీవల బెయిల్‌పై విడుదల అయి వచ్చాడు. అనంతరం రాజీ కోసం ఇరు కుటుంబాలవారు ప్రయత్నాలు చేశారు. అయితే మధులక్ష్మి కేసు ఈనెల 16న ట్రెయిల్‌కు వచ్చింది. దీంతో న్యా యస్థానంలో ఎక్కడ శిక్ష పడుతుందోనని భయంతో రామారావు ఆత్మహత్య చేసు కున్నాడు. తన మృతికి ఎవరూ కారణం కాదని, తనకు పెద్దలు ఎవరూ సహక రించలేదని, ఎవరి పేరూ బయటపెట్టనని, కుమార్తెను బాగా చూసుకోవాలని మృతుడి జేబులో లేటర్ రాసి ఉంది. దీనిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మృతుడి తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పాపారావు తెలిపారు. అయితే మృతుడి కుమార్తె గతంలో తల్లిని కోల్పోయి, ప్రస్తుతం తండ్రిని కోల్పోయి అనాథగా మిగిలింది.

## పన్ను చెల్లింపుకు 50 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి : కమిషనర్ బాలస్వామి



**విజయనగరం, పతాకం న్యూస్:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏక మొత్తంలో పన్నులు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కమిషనర్ బాలస్వామి మంగళవారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ చక్కటి అవకాశాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియపరిచేందుకు ప్రచారాలను ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. మార్చి 31వ తేదీ లోపు బకాయి ఉన్న పన్నులు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించిన వారికి మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ సౌకర్యం లభిస్తుందని తెలిపారు. ఇంటి పన్నులు, ఖాళీ స్థలముల పన్నులు వెంటనే చెల్లించి వడ్డీ రాయితీ సౌకర్యాన్ని పొందాలని కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలోను, సచివాలయాలలోనూ, ఆన్లైన్ ద్వారా కూడా పన్ను చెల్లింపులకు అవకాశం ఉన్నదని తెలిపారు.

## ముగిసిన పాలకవర్గాల పదవీకాలం



**సాలూరు, పతాకం న్యూస్:** ఉమ్మడి జిల్లాలో పాలకవర్గాల పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. నగర కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో బుధవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలుకానుంది. సాలూరుకు పార్వతీపురం సబ్ కలెక్టర్ వైశాలి, పార్వతీపురానికి జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, పాలకొండకు పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను ప్రత్యేకాధికారులుగా నియమించారు. విజయనగరం కార్పొరేషన్‌కు ఆ జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, బొబ్బిలికి ఆర్డీవో మోహన రావు, నెల్లిమర్లకు ఆర్డీవో వెంకటేశ్వరరావులను ప్రత్యేకాధికారులను నియమిస్తు మున్సిపల్ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్‌కుమార్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఆరు నెలల వ్యవధిలో స్థానిక ఎన్నికలను నిర్వహించనున్నట్టు ఈ నెల 13న జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఆరు నెలల కాలంలో మునిసిపాలిటీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకోనున్నాయని పట్టణవాసులు భావిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మునిసిపాలిటీల్లో ఓటర్ల జాబితా రూపొం దించే కార్యక్రమం తుది దశకు చేరింది.

## 'సీహెచ్‌డబ్ల్యూల సమస్యలు పరిష్కరించాలి'



**సీతంపేట, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల(సీహెచ్‌డబ్ల్యూ) సమస్యలు పరిష్కరించా లని సీఐటీయూ నాయకులు కె.నాగమణి, సరస్వతి, కాంచన కోరారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు, సీహెచ్‌డబ్ల్యూలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిమాండ్ల తో కూడిన వినతిపత్రాన్ని ఏపీవో జి.చిన్నబాబుకు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌డబ్ల్యూలు ఎస్.కాంచన, సరస్వతి, మల్లమ్మ, ఎస్.శిరీష, మార్తమ్మ, శాంతి, మాణిక్యం, కుమారి, రాధిక, జయలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

## రోడ్డుకి ఇచ్చిన భూమికి పరిహారం ఇవ్వాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** రోడ్డు నిర్మాణానికి భూమి ఇచ్చామని, అయితే దానికి పరిహారం ఇవ్వకుండా నిర్మాణం ఎలా చేపడతారని అల్లెన గ్రామానికి చెందిన రైతు ఆలుబిల్లి తవిటినాయుడుతో పాటు మరికొందరు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు రోడ్డుకు అడ్డంగా కర్రలతో అడ్డంగా కంచె ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. వివ రాలిలా ఉన్నాయి.. అల్లెన గ్రామం నుంచి శ్రీకాకుళం ప్రధాన రహదారి వరకు రూ.ఆరు కోట్లతో బీటీ రోడ్డు పను లు ప్రారంభించారు. అయితే ఈ రోడ్డు నిర్మాణానికి సంబం ధించి కొందరు రైతులు భూములను కోల్పోయారు. ఇందులో తనకు చెందిన 56 సెంట్లు రోడ్డులో పడిపోయి పరిహారం ఇవ్వక పోవడంతో హైకోర్టులో పిటిషన్ వేసినట్లు తవిటి నాయుడు తెలిపారు. అయినప్పటికీ పనులు చేపడుతుం డడంతో సదరు వ్యక్తితో పాటు మరికొందరు కంచె ఏర్పాటు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయులు సోమవారం సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్య పరిష్కారానికి రైతులతో మాట్లాడతామన్నారు. రోడ్డు మధ్య కంచె ఏర్పాటు చేయకూడదన్నారు.

## బీఆర్ నాయుడు వ్యవహారంపై వైసీపీ మహిళా నాయకుల నిరసన



**తిరుపతి, పతాకం న్యూస్:** టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు వ్యహారం వైసిపి, కూటమి నాయకుల మధ్య తిరుపతిలో గొడవకు దారి తీసింది. వివరాల్లోకెళితే... టిటిడి చైర్మన్ బిఆర్. నాయుడు వివాహేతర సంబంధం వ్యవహారంపై వైసిపి మహిళా నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆయన బస చేసిన తిరుచానూరు సమీపంలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్ ముందు నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. దీంతో టిడిపి, కూటమి నాయకులు జెబి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకొని వైసిపికి వ్యతిరేకంగా నినదించారు. మహిళలు హోటల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కూటమి నాయకులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు భౌతిక దాడికి దిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళలతో పాటు నవీన్ అనే వైసిపి కార్యకర్తకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తిరుచానూరు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, బిఆర్ నాయుడికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో వైసిపి సమన్వయకర్త భూమన అభినరురెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు. ప్రైవేటు హోటల్ వద్ద రెచ్చగొట్టేలా వైసిపి నాయకులు వ్యవహరించారని, వారిపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## నేను తప్పు చేయలేదు: ఎంపీ పుట్టా మహేశ్



**కోనసీమ, పతాకం న్యూస్:** హైదరాబాద్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ సంబంధిత వ్యవహారంలో తన పేరు రావడంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పందించారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, ఈ ఆరోపణల నుంచి నిర్దోషిగా బయటకు వస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఘటనలో తన పేరు ప్రస్తావనకు రావడం దురదృష్టకరమని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఆ రోజు డిన్నర్‌కు హాజరైన మాట వాస్తవమే అయినప్పటికీ, తాను ఎటువంటి తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని, అందుకే ప్రజలకు, పార్టీ అధిష్టానానికి వాస్తవాలు తెలియజేస్తున్నానని వివరించారు. ఈ కేసు విచారణకు పోలీసులకు పూర్తిగా సహకరిస్తానని ఆయన తెలిపారు. అదే సమయంలో, పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటానని చెప్పారు. పార్టీ నుంచి అందిన నోటీసుకు లిఖితపూర్వకంగా వివరణ సమర్పిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆరోపణల నుంచి బయటపడి, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎప్పటిలాగే కట్టుబడి పనిచేస్తానని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు.

## తుని మున్సిపాలిటీ సమావేశంలో రాజకీయ రగడ



**కాకినాడ, పతాకం న్యూస్:** తుని మున్సిపాలిటీ చివర సమావేశంలో వైసీపీ టిడిపి,ప పార్టీలకు చెందిన కౌన్సిలర్లు మధ్య రాజకీయ రగడ రగులుతుంది. మంగళవారం నాడు తుని మున్సిపాలిటీలో అత్యవసర చివరి సమావేశం చైర్మన్ నార్ల భవన సుందరి అధ్యక్షతన నిర్వహించారు. తుని పట్టణ పరిధిలో పారిశుద్ధ్య పరిరక్షణ ఉపయోగించే టాక్టర్లు రిపేర్లకు 95000 వేలు పారిశుద్ధ కార్మికుల క్లాత్ అవసరాల కొరకు 99900, పదో వార్డ్ లో సిసి రోడ్డు నిర్మాణానికి ఎనిమిది లక్షలు అంచనా వేసి కౌన్సిలర్ ప్రతిపాదన కోరగా కౌన్సిలర్లు ఆమోదించడంతో త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని మున్సిపాలిటీ చైర్మన్ నార్ల భవన సుందరి తెలిపారు. అనంతరం టిడిపి కౌన్సిలర్లు కర్రీ శ్రీదేవి, పులి సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విప్పు తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆధ్వర్యంలోనే 18 నెలల కాలంలో పరిపాలనలో మున్సిపాలిటీని సుమారు18 కోట్ల రూపాయల నిధులతో అభివఅద్ధి పరచడం జరిగిందని, గత ప్రభుత్వశీ పాలల్లో తుని మునిసిపాలిటీ పూర్తిస్థాయిలో అభివఅద్ధి పరచలేదని విమర్శించారు. అనంతరము వైసీపీ కౌన్సిలర్లు కర్రీ జగదీష్, కాసే సుమతి,జాన్ ఆనంద్ మాట్లాడుతూ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో తుని పట్టణాన్ని డ్రైనేజీలు, సిసి రోడ్లను, నిర్మాణం చేపట్టి పారిశుద్ధ్యన్ని మెరుగుపరిచారని, గణపతి నగర్ లో ఆధునికరమైన మున్సిపాలిటీ పార్కును నిర్మించారని అన్నారు. వైసిపి టిడిపి కౌన్సిలర్లు తమ పాలంలో అభివఅద్ధి చేశామంటూ ఒకరి మీద ఒకరు విమర్శలు చేసుకోవడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. జిల్లా టిడిపి పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ తుని మున్సిపాలిటీ చైర్మన్ ఇన్నిగంటి సత్యనారాయణ మధ్యలో కలగజేసుకుని ఇరువురు రాజకీయ విమర్శించుకోవడానికి ఇది సరైన వేదిక కాదని,పదవి ముగింపు వేదికని గుర్తుచేసి ఇరువురిని సముదాయించారు. ఎంతకాలమో పదవిలో ఉన్నాము అనేది కాదు గాని ఎంత అభివఅద్ధి చేశామన్నదే ప్రజలు గుర్తించి మళ్లీ మనల్ని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారని అన్నారు. అనంతరము వైసీపీ కౌన్సిలర్లు అందరూ సభలో నుండి వెళ్లిపోయారు. అనంతరము మున్సిపాలిటీ చైర్మన్ నార్ల భవన సుందరి, వైస్ చైర్మన్ లను, కౌన్సిలర్లను మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, కూటమి నాయకులు ఇనుగంటి సత్యనారాయణ, చింతమనేడి అబ్బాయి, కుక్కడుపు బాలాజీ, మున్సిపాలిటీ కమిషనర్ వెంకటరావు, సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధి లు, నాయకులు, అభిమానులు ఘనంగా సన్మానించారు.

# ముఖ గుర్తింపుతో ఉపాధి హామీ కూలీలకు తిప్పలు తప్పవా?



**అమరావతి, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం స్థానంలో నూతనంగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్రామీణ్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (విబి గ్రామ్ జి) పథకం అమలును నూరు శాతం డిజిటలైజ్ చేయడంతో వేతనదారులపై ఈ ప్రభావం అధికంగా ఉండే పరిస్థితి నెలకొంది. నూతన పథకం ప్రకారం వేతనదారుల గుర్తింపు, హాజరు, వేతనాల చెల్లింపునకు నూరు శాతం డిజిటల్ విధానాలను తప్పనిసరి చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతున్న ఈ పథకంలో వేతనదారులను గుర్తించేందుకు, హాజరు నమోదు చేసేందుకు ముఖ ఆధారిత విధానాన్ని వినియోగిస్తారు. దీనివల్ల ఏజెన్సీ ఏరియాలు, మారుమూల గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేనిచోట డిజిటల్ విధానంలో హాజరు నమోదు ఇబ్బందికరంగా మారనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు, నంద్యాల, నెల్లూరు తదితర జిల్లాల్లో 5,67,816 గిరిజన కుటుంబాలకు సంబంధించిన 45,23,834 గిరిజన వేతనదారులు ఈ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. పల్నాడు, ఏలూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురం తదితర జిల్లాల్లో మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం అంతగా అందుబాటులో లేదు. ఎన్‌ఆర్‌ఇజిఎ సాఫ్ట్ వెబ్‌సైట్ లెక్కల ప్రకారం ఉపాధి హామీలో పనుల కోసం డిమాండ్ చేస్తున్న వేతనదారుల సంఖ్య గతేడాది కంటే ఈ ఏడాది పెరిగింది. గతేడాది 51.22 లక్షల కుటుంబాలకు చెందిన 85,73,344 మంది పని కోసం డిమాండ్ చేయగా, ప్రస్తుతం 51.81 లక్షల కుటుంబాల నుంచి 87,14,746 మంది డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి పనులకు డిమాండ్ ఉన్నా డిజిటలైజేషన్, ఆధార్ బేస్ట్ పేమెంట్ సిష్టం (ఎబిపిఎస్) వంటి విధానాల వల్ల ఈ పథకం నుంచి లక్షలాది మంది తొలగించబడుతున్నారని వివిధ సంస్థల అధ్యయనాల్లో వెల్లడైంది. 2022-23లో ఎబిపిఎస్ విధానం అమలులోకి వచ్చిన అనంతరం ఒక్క ఏడాదిలోనే 78 లక్షల మంది వేతనదారులు పనులకు దూరమయ్యారని ఉపాధి హామీపై అధ్యయనం చేస్తున్న లిబ్‌టెక్ సంస్థ గతేడాది నవంబరులో విడుదల చేసిన నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. గతేడాది అక్టోబరు 8 నుంచి నవంబరు 19వ తేదీ మధ్య 14.2 లక్షల మంది ఈ పథకం నుంచి బయటకు నెట్టివేయబడ్డారని నివేదికలో వెల్లడించింది. ఇటువంటి పరిస్థితుల్లో విబి గ్రామ్ జి పథకంలో పూర్తి స్థాయిలో డిజిటల్ విధానాలతో హాజరు, వేతనదారుల గుర్తింపు ఎలా సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ఉపాధి హామీ చట్టంలో నమోదైన 65.75 లక్షల కుటుంబాలకు చెందిన 1,13,39,084 మంది వేతనదారుల్లో ఇప్పటి వరకూ ఇకెవైసి పూర్తి చేసుకున్నది కేవలం 86 శాతం మంది. మిగిలిన వేతనదారుల ఇకెవైసిని మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 15 రోజుల వ్యవధిలో ఇకెవైసి నూరు శాతం పూర్తి చేయడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఈ పరిస్థితిపై ఆందోళన చెందుతున్నారు. కొత్త పథకం అమల్లోకి వస్తే డిజిటలైజేషన్ విధానాల వల్ల తలెత్తే సమస్యలపై ఇప్పటికే వారి సంఘాల నేతల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

# లస్కర్ల నియామకం ఎప్పుడో? అస్తవ్యస్తంగా సాగునీటి కాలువల నిర్వహణ



**పార్వతీపురం, పతాకం న్యూస్:** సాగునీటి వ్యవస్థలో లస్కర్ల పాత్ర చాలా కీలకం. అయితే జిల్లాలో ఏ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో కూడా లస్కర్లు లేరు. చాలా సంవత్సరాల నుంచి ఆ పోస్టులను భర్తీ చేయడం లేదు. లస్కర్ల విధానాన్ని పాలకులు పూర్తిగా గాలికి వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో సాగునీటి కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో వట్టిగెడ్డ, వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్), పెద్దగెడ్డ, తోటపల్లి, పెదంకలం తదితర సాగునీటి ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రతి ప్రాజెక్టు పరిధిలో ప్రతి 1500 ఎకరాలకు ఒక లస్కర్ నియమించాల్సి ఉంది. అదే విధంగా కాలువల నిర్వహణకు సంబంధించి ప్రతి ఆరు కిలోమీటర్లకు ఒక లస్కరు ఉండాలి. ఈ లెక్కన జిల్లాలో సుమారు 155 మంది లస్కర్లను నియమించాల్సిన అవసరం ఉంది. కానీ, ఒక్కరు కూడా లేకపోవడంతో సాగునీటిని అందించడంలో, ప్రాజెక్టుల ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. గతంలో వీఆర్ఎస్ ప్రాజెక్టు పరిధిలో 15 మంది లస్కర్లు పని చేసేవారు. అయితే, వేతనాలు సక్రమంగా చెల్లించలేని పరిస్థితి ఉండడంతో వారిని నిలిపివేశారు. లస్కర్ల నియామకంపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా ఇరిగేషన్ అధికారులు లేఖలు రాసినప్పటికీ ఫలితం శూన్యం. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే దీనిపై ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. జిల్లాలో వట్టిగెడ్డ, వెంగళరాయసాగర్ (వీఆర్ఎస్), పెద్దగెడ్డ, తోటపల్లి, పెదంకలం తదితర సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని పంట పొలాలలకు లస్కర్లు సాగునీటిని వదిలి పెట్టేవారు. ప్రతి ఆరు కిలో మీటర్లకు ఒక లస్కరు చొప్పున ఉండి సాగునీటి పంపకాలు చేపట్టేవారు. రైతులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు వహించేవారు. షట్టర్లకు, తలుపులకు గ్రీజు పెట్టడం వంటి పనులు చేపట్టేవారు. కాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కలను తొలగించేవారు. ఇదంతా గతం. ప్రస్తుతం వారంతా రిటైర్డ్ అయ్యారు. వారిస్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో కాలువల నిర్వహణ అధ్వానంగా ఉంది.

# భారత్‌కు భారీ ఊరట.. క్షేమంగా ముంద్రా పోర్టుకు చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్ 'శివాలిక్'

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో భారీ ఊరట లభించింది. ఖతార్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో బయలుదేరిన 'శివాలిక్' అనే భారత నౌక, అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిని దాటి గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. ఈ నౌకలో సుమారు 45,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 'శివాలిక్', 'నందా దేవి' అనే రెండు నౌకలు కలిపి మొత్తం 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని భారత్‌కు తీసుకువస్తున్నాయి. శివాలిక్ ఇప్పటికే తీరానికి చేరుకోగా, 'నందా దేవి' అనే మరో ట్యాంకర్ రేపు ఉదయం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు రానుంది. ఈ విషయాన్ని కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా ధృవీకరించారు.

పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సిన్హా స్పష్టం చేశారు. ప్రస్తుతం హార్ముజ్ జలసంధికి పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిలో 611 మంది సిబ్బంది ఉన్నారని తెలిపారు. వీటితో పాటు, యూఏఈ నుంచి సుమారు 81,000 టన్నుల ముడిచమురుతో వస్తున్న 'జగ్ లాడ్కీ' నౌక కూడా ముంద్రా పోర్టుకు వస్తోందని, ఆ నౌకలోని సిబ్బంది కూడా క్షేమంగా ఉన్నారని అధికారులు




వెల్లడించారు.

ప్రపంచంలోని చమురు, గ్యాస్ ఎగుమతుల్లో దాదాపు 20 శాతం హార్ముజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో, అధికారులు నౌకల కదలికలను నిశితంగా గమనిస్తూ, షిప్పింగ్ లైన్లకు అవసరమైన మద్దతును అందిస్తున్నారు.

## గ్రామాభివృద్ధికి పంచాయతీలు ఆర్థికంగా బలపడాలి

**కోనసీమ, పతాకం న్యూస్:** గ్రామాభివృద్ధికి పంచాయతీలు ఆర్థికంగా బలపడి స్థిరమైన పురోగతిని సాధించాలని ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులు, ఎంపీటీసీలకు ఒకరోజు శిక్షణ తరగతుల కార్యక్రమం మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు మాట్లాడుతూ ... గ్రామపంచాయతీల ఆదాయ వనరులు పెంపొందించడం, మిలీనియం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గ్రామస్థాయిలో సమర్థంగా అమలు చేసే విధానాలపై చర్చించారు. అలాగే ఈ శిక్షణకు తర్ఫీదు పొందిన మోదుకూరు పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి సాయి ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీలకు లభించే పన్నులు, ఫీజులు, ప్రభుత్వ పథకాల నిధులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే అభివృద్ధి లక్ష్యాలను గ్రామస్థాయిలో అమలు చేయడం ద్వారా పరిశుభ్రత, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.

# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు



**ప్రకాశం, పతాకం న్యూస్:** గ్రామాలు, పట్టణాల్లో గ్యాస్ సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లను హెచ్చరించారు. మంగళవారం మార్కాపురంలోని కలెక్టరేట్లో వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రస్తుతం గ్యాస్ పంపిణీ విధానం, లోటు పాట్లు, కొరత రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ ఆదేశాలను స్పష్టంగా వివరించారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలించడం, ఎక్కువ రేట్లు అమ్మడం, నిల్వ చేయడం వంటివి చేయకూడదని తెలిపారు. వినియోగదారులు బుక్ చేసుకున్న సిలిండర్లను గ్రామాల్లో పంపిణీ చేస్తున్నప్పుడు డబ్బులు డిమాండ్ చేయకూడదని వివరించారు. అలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. నూటికి 95 శాతం మంది ప్రజలు సంతృప్తి చెందెలా చూడాల్సిన బాధ్యత డిస్ట్రిబ్యూటర్లదేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో 45 రోజులు, పట్టణాల్లో 25 రోజుల గ్యాప్ తో ప్రజలు గ్యాస్ బుక్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఒక్కో సిలిండర్ ఉన్నవారు ముందుగా కాకుండా ఐదు రోజుల ముందు బుక్ చేసుకోవాలన్నారు. గ్యాస్ వినియోగదారులు స్పాట్ బుకింగ్ డిమాండ్ చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా పౌర సరఫరాల అధికారి డి. అంకయ్య, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మించాలంటూ మానవహారం



**గుంటూరు, పతాకం న్యూస్:** తాడికొండ-రాయపూడి ఆర్ అండ్ బి రోడ్డును తక్షణమే యుద్ధప్రాతిపదికన నిర్మించాలని రాజధాని అభివృద్ధి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళ వారం నెక్కల్లు నుంచి పాదయాత్రగా పెదపరిమి చేరుకున్న రాజధాని అభివృద్ధి నాయకులు, కార్యకర్తలు ఎన్ టి ఆర్ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి రోడ్డు నిర్మించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధి వేదిక నాయకులు వై నేతాజీ మాట్లాడుతూ ... గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి తాడికొండ మీదుగా పెదపరిమి, తుళ్లూరు, రాయపూడి మీదుగా రాజధానికి నిత్యం ప్రయాణాలు జరుగుతాయని చెప్పారు. హైకోర్టు, సచివాలయం, ఇతర నిర్మాణ ప్రదేశాలకు,యూనివర్సిటీ లకు వాహనాలలో రాకపోకలు సాగుతుంటాయని చెప్పారు.రాజధాని నిర్మాణం నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా తాడికొండ నుంచి రాయపూడి వరకు రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గుంతలతోపాటు దుమ్మూ ధూళీ ఎగిసి పడి ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారని నేతాజీ అన్నారు.

# సర్వర్ సమస్యతో ఉపాధి హామీ కూలీల అవస్థలు



**కోనసీమ, పతాకం న్యూస్:** ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీలు సర్వర్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీలకు ముఖ ఆధారిత ఇకెవైసి చేయాలనే నిబంధన కూలీలకు చుక్కలు చూపిస్తోంది. సర్వర్ పని చేయకపోవడం, సిగల్ లేకపోవడంతో కూలీలు పని ముగిసిన తరువాత కూడా వేచి ఉండాల్సిన పరిస్థితి సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని 17 గ్రామాలలో 6,179 జాబ్ కార్డులు ఉండగా 9,437 కూలీలు పని చేస్తున్నారు. సోమవారం మండలంలోని వద్దుపర్రు గ్రామం మినహా అన్ని గ్రామాలలో 254 మంది కూలీలు పని చేశారు. అయితే ముఖ ఆధారిత ఇకెవైసి చేయడానికి సర్వర్ సమస్యతో కూలీలు నానాపాట్లు పడ్డారు.

# కాలువలో పడి ఇద్దరు విద్యార్థులు మృతి



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** పిప్పర గ్రామానికి చెందిన భూపతిరాజు సుబ్బరాజు కుమారుడు సుశాంత్ వర్మ, అతని మిత్రుడు ఇందుకూరి ప్రమోద్ వర్మ కలసి సాయంత్రం ఉండి కాలవలోకి స్నానం చేయటానికి దిగి ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయారు. సుశాంత్ వర్మ మృతదేహం దొరకగా ప్రమోదువర్మ మృతదేహం దొరకలేదని, గాలిస్తున్నట్లు ఎస్ఐ ఎం.మణికుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఉంగుటూరు ఎంఎల్ఏ పత్సమట్ల ధర్మరాజు పిప్పర వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను కలసి సానుభూతి తెలిపారు.

## పశ్చిమాసియాలోకి
# 'డూమ్స్ డే' విమానాలు!




**వాషింగ్టన్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధం రానురాను ప్రపంచానికే విపత్తు కలిగించే దిశగా వెళ్తున్నట్లు కనిపిస్తోంది. అమెరికా వద్ద ఉన్న అత్యంత కీలకమైన విమానాలు పశ్చిమాసియాలో కనిపించటం ఇప్పుడు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. డూమ్స్ డే (ప్రళయకాల) విమానాలుగా పిలిచే 'ఈ-6బీ మెర్క్యూరీ స్ట్రాటజిక్ ఎయిర్‌బోర్న్ కమాండ్' విమానాలు తాజాగా పశ్చిమాసియాలో కనిపించాయి. అణ్వాయుధదాడి జరిగి భూమిపై ఉన్న అమెరికా సిగ్నలింగ్, కమాండింగ్ సెంటర్లు ధ్వంసమయ్యే పరిస్థితులు ఉంటేనే సాధారణంగా ఈ విమానాలను రంగంలోకి దించుతారు. ఇవి ఆకాశంలో కదిలే కమాండింగ్ సెంటర్లుగా పనిచేస్తాయి. దేశాధ్యక్షుడు, యుద్ధ శాఖ మంత్రి సభ్యులుగా ఉండే కమాండ్ సెంటర్‌తో అమెరికా దళాల (వ్యూహాత్మక, వ్యూహాత్మకం కాని)తో సమాచార సంబంధాలను కొనసాగించటం ఈ విమానాల ప్రధాన విధి. ప్రపంచవ్యాప్తంగా అమెరికా దాచి ఉంచిన ఖండాంతర క్షిపణులను ఈ విమానాల నుంచి నేరుగా ఆదేశాలిచ్చి ప్రయోగించవచ్చు. సముద్ర గర్భంలో శత్రువుకు చిక్కకుండా దాగి ఉండే అమెరికా అణు జలాంతర్గాములతో ఈ విమానాల్లోని కమాండింగ్ సెంటర్ల ద్వారా సంభాషించవచ్చు. అత్యవసర సమయంలో అధ్యక్షుడు జారీచేసే 'టేక్ చార్జ్ అండ్ మూవ్ ఔట్' (టకమో) ఆదేశాలను నేవీ అణు జలాంతర్గాములకు చేరవేయటం ఈ విమానాల అతి కీలకమైన విధి. ఈ-6బీ స్ట్రాటజిక్ కమాండ్ విమానాలు ప్రచ్ఛన్న యుద్ధ కాలం చివరి దశ నుంచి అమెరికాలో సేవలందిస్తున్నాయి. అమెరికా వద్ద ఇలాంటివి 16 ఉన్నాయని అంచనా. 150 మీటర్ల పొడవుండే ఈ విమానం ఖరీదు దాదాపు రూ.130.7 కోట్లు. ఇది 40 వేల అడుగుల ఎత్తు వరకు చేరుకోగలదు. ఈ విమానాలు నేలకు దిగకుండా ఆకాశంలోనే ఇంధనం నింపుకొంటూ ఏకంగా మూడు రోజులపాటు ఉండగలవు. ఏకబిగిన దాదాపు 7,000 మైళ్లు ప్రయాణించగలవు. వీటిలో అత్యంత శక్తిమంతమైన వెరీ లోఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) సందేశాలను ప్రసారం చేసే వ్యవస్థ ఉంటుంది. ఈ విమానాలు రంగంలోకి దిగాయంటే ఏదో పెద్ద విపత్తే జరిగే ప్రమాదం ఉందని అర్థమని యుద్ధ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# మహిళల్లో ఈ లక్షణాలు కనిపిస్తే ఎండోమెట్రియోసిస్ ఉన్నట్లే..!



మహిళల్లో వచ్చే గర్భాశయ సంబంధిత సమస్యల్లో ఎండోమెట్రియోసిస్ కూడా ఒకటి. ఎండోమెట్రియోసిస్ అనేది గర్భాశయం లోపలి పొర లాంటి కణజాలం గర్భాశయ వెలుపల పెరిగే ఒక పరిస్థితి. ఈ కణజాలం గర్భాశయం బయట పెరగడం వల్ల తీవ్రమైన నొప్పితో పాటు ఇతర సమస్యలు కూడా వస్తాయి. ఇది కేవలం నెలసరినే కాదు రోజువారీ జీవితాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. పునరుత్పత్తి వయసులో ఉన్న మహిళల్లో దాదాపు 10 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేస్తోంది. ఎండోమెట్రియోసిస్ సాధారణంగా కటి లేదా ఉదరంలోని పునరుత్పత్తి అవయవాలపై లేదా చుట్టూ కనిపిస్తుంది. ఫెలోపియన్ ట్యూబ్స్, గర్భాశయం చుట్టూ ఉన్న లిగమెంట్స్, పెల్విక్ కవిటీ లైనింగ్, ఓవరీస్, గర్భాశయం, రెక్టం లేదా మూత్రాశయం మధ్య భాగం, గర్భాశయం బయటి ఉపరితలం వంటి భాగాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అరుదుగా ఇది మూత్రాశయం, సర్విక్స్, పేగులు, రెక్టం, పొట్ట, వజైనా/వల్వా ప్రాంతాల్లో కూడా పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎండోమెట్రియోసిస్ వల్ల తీవ్రమైన నొప్పి, తిమ్మిర్లు వస్తాయి. చాలా మంది దీనిని సాధారణ పీరియడ్స్ నొప్పిగా భావించి పట్టించుకోరు. కానీ ప్రతి నెలసరి నొప్పి సాధారణం కాదు. కొన్ని లక్షణాలు ఎండోమెట్రియోసిస్‌కు సంకేతం కావచ్చు. పీరియడ్స్ నొప్పి ఎండోమెట్రియోసిస్ కావచ్చని సూచించే కొన్ని లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. సాధారణంగా పీరియడ్స్ క్రాంప్స్ కొంచెం నొప్పిగా ఉంటాయి. విశ్రాంతి లేదా మందులతో తగ్గుతాయి. కానీ ఎండోమెట్రియోసిస్‌లో నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. పీరియడ్స్ ప్రారంభానికి ముందు నుంచే మొదలై చాలా రోజుల వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో బయట పెరిగిన కణజాలం కూడా పీరియడ్స్‌లాగే రక్తస్రావం చేసి వాపు కలిగిస్తుంది. దీంతో చుట్టూ ఉన్న అవయవాలు, నరాలు కూడా ఇబ్బందికి గురవుతాయి. చాలా మంది మహిళలు ఈ నొప్పి వల్ల వారి పనులను కూడా వారు చేసుకోలేకపోతారు. అలాగే పీరియడ్స్ ముగిసిన తర్వాత కూడా పొత్తికడుపు లేదా పెల్విస్ ప్రాంతంలో నొప్పి ఉంటే దానిని సాధారణంగా భావించకూడదు. ఇది నిరంతర ఒత్తిడి, తట్టుకోలేని నొప్పి లేదా మంటలా అనిపించవచ్చు. ఇది అవయవాలు ఒకదానికొకటి అంటుకోవడం లేదా దీర్ఘకాలిక వాపు వల్ల వస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు లేదా విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు కూడా ఈ నొప్పి రావచ్చు. అదే విధంగా సంభోగం సమయంలో లేదా తరువాత పెల్విస్, నడుము లేదా తొడల్లో నొప్పి ఉంటే అది ఎండోమెట్రియోసిస్ సంకేతం కావచ్చు. ఓవరీస్, ఫెలోపియన్ ట్యూబ్స్ లేదా పెల్విక్ లైనింగ్ మీద ఉన్న లెషన్స్ కదలిక వల్ల నొప్పి పెరుగుతుంది. కొంతమందిలో ఈ నొప్పి సంభోగం తర్వాత గంటల పాటు కొనసాగుతుంది. పీరియడ్స్ సమయంలో చాలా ఎక్కువగా రక్తస్రావం అవడం, ప్రతి గంటకోసారి ప్యాడ్ లేదా టాంపాన్ మార్చుకోవాల్సి రావడం, ఒక వారం కంటే ఎక్కువ రోజులు పీరియడ్స్ కొనసాగడం కూడా ఎండోమెట్రియోసిస్ లక్షణం కావచ్చు. అదనపు కణజాలం నుండి ఒకేసారి రక్తస్రావం కావడం వల్ల ఇలా జరుగుతుంది. కొంతమందిలో పీరియడ్స్ మధ్యలో కూడా స్పాటింగ్, వాపు, అలసట వంటి సమస్యలు కనిపిస్తాయి. అలాగే పీరియడ్స్ సమయంలో డయేరియా, మలబద్ధకం, మలంలో రక్తం వంటి సమస్యలు రావడం, తరచుగా మూత్రం రావడం, మూత్ర విసర్జన సమయంలో మంట ఉండటం కూడా కనిపించవచ్చు. ఇది పెల్విక్ ప్రాంతంలో వాపు పెరగడం వల్ల సమీప అవయవాలపై ఒత్తిడి పడటం వల్ల జరుగుతుంది. కొంతమందికి నడుము, తొడలు, మోకాళ్లు లేదా హిప్స్ లో నొప్పి ఉంటుంది. ఇది సయాటిక్ నరంపై ఒత్తిడి వల్ల రావచ్చు. కొన్నిసార్లు కాళ్లలో స్పర్శ లేనట్టుగా లేదా బలహీనత కూడా అనిపించవచ్చు. ఎండోమెట్రియోసిస్ ఉన్న మహిళలకు తీవ్ర అలసట, వాంతులు, తల తిరిగినట్టుగా ఉండడం, మెదడు మత్తుగా ఉండటం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇది శరీరంలో వాపు పెరగడం వల్ల జరుగుతుంది. అలాగే ఫెలోపియన్ ట్యూబ్స్ బ్లాక్ కావడం లేదా ఓవరియన్ సిస్ట్స్ వల్ల కొందరిలో గర్భధారణకు ఆటంకం కలగడంతో పాటు వంధ్యత్వం సంభవిస్తుంది.

ఈ లక్షణాలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య మరింత తీవ్రతరం కాకుండా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలకు కొత్త రూపు!



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యంతో తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం సమీపంలోని స్వర్ణ సచివాలయానికి పంపిస్తారు. పొడిచెత్తను కంపోస్టుగా తయారు చేసి స్థానిక రైతులకు అందజేస్తారు. ఇందుకోసం ఆయా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేశారు. జీరో వేస్ట్ నిర్వహణకు ఉపాధ్యాయులు మార్గదర్శులుగా నిలుస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత ఏడాది డిసెంబరు 20న కశింకోట మండలం తాళ్లపాలెంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సందర్శించిన సందర్భంగా పాఠశాలల్లో చెత్త నిర్వహణను మెరుగుపర్చాలని సూచించారు. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్ సూచనల మేరకు విద్యా శాఖాధికారులు జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల్లో చెత్త వ్యర్థాల నిర్వహణను వినూత్నంగా అమలు చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో అనకాపల్లి జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు చేస్తున్న 'జీరో వేస్ట్' విధానాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ విధానాన్ని మెచ్చుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. కలెక్టర్‌ను అభినందించడమే కాకుండా ఈ కార్యక్రమానికి ఏదైనా ఒక పేరును ఎంపిక చేసి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. దీంతో జిల్లాలో అమలు చేస్తున్న 'జీరో వేస్ట్' కార్యక్రమానికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల్లో వాడుక అనంతరం వృథాగా పోయే నీటిని హానికరం కాని నీరు, హానికరమైన నీరుగా ప్రత్యేక పద్ధతి ద్వారా విభజిస్తున్నారు. హానికరమైన నీటిని బయటకు పంపుతూ, హానికరం కాని నీటిని గార్డెన్‌కు, మొక్కలకు వినియోగిస్తున్నారు. పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం సమీపంలోని స్వర్ణ సచివాలయానికి అందజేస్తున్నారు. తడి చెత్తను పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఒక గొయ్యి తవ్వి అందులో వేస్తారు. ఇది కంపోస్టుగా తయారైన తరువాత అదే గ్రామంలో రైతులకు అందజేస్తారు. జిల్లాలోని 114 రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల్లో చదువుకుంటున్న మొత్తం 24,776 మంది బాలబాలికలను జీవో వేస్ట్ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. ప్రతి విద్యార్థి నిర్దేశించిన సమయంలో చెత్త నిర్వహణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఆయా రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల నుంచి ప్రతి నెలా 57.1 టన్నుల తడిచెత్త, 24.5 టన్నుల పొడి చెత్త ఉద్భవిస్తుందని అంచనా వేశారు. ఈ చెత్త నిర్వహణ ద్వారా ప్రతి పాఠశాలకు సగటున నెలకు రూ.2.17 లక్షల ఆదాయం సమకూరుతుంది. జిల్లాలో జీరో వేస్ట్ నిర్వహణలో మాకవరపాలెం, కె.కోటపాడు మండలం ఎ.కోడూరు, కశింకోట మండలం తాళ్లపాలెంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు/ వసతిగృహాలు ముందువరుసలో వున్నాయి.

## అఫ్గానిస్థాన్‌లో పాకిస్థాన్ వైమానిక దాడి.. 400 మంది మృతి..



**అఫ్గానిస్థాన్:** అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణలు పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరు పక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది. 'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు.

## స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

**అమలాపురం, పతాకం న్యూస్:** అమలాపురం నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచినీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మంగళవారం అమలాపురం మండలంలో గున్నేపల్లి అగ్రహారం, సాకుర్రు, ఇందుపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకులను గ్రామ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి రామచంద్రారావు (రాము), గుత్తుల చిరంజీవిరావు, చొల్లంగి శివాలినీలతో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ ఆనందరావు ప్రజల ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైన మంచినీటి సరఫరా విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు.




# టీ20 ఫార్మాట్ సౌకర్యవంతంగా ఉంటుంది..
# ఇషాన్‌ను తీసుకోవడం కఠిన నిర్ణయం: సూర్యకుమార్



కెరీర్‌లో ఒక్క టెస్టు మాత్రమే ఆడిన కెప్టెన్ సూర్యకుమార్ టీ20 ఫార్మాట్ అత్యంత సౌకర్యవంతంగా ఉందని చెబుతున్నాడు. పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టుకు టీ20 వరల్డ్‌కప్ అందించిన మూడో కెప్టెన్‌గా సూర్య నిలిచిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం టీమిండియాకు ఈ ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్న సూర్య గతంలో ఓ టెస్టుతో పాటు 37 వన్డేల్లోనూ బరిలోకి దిగాడు. టెస్టులకు దూరమై కేవలం టీ20ల్లోనే ఆడడంపై సూర్య స్పందిస్తూ.. 'సుదీర్ఘ ఫార్మాట్‌లో నేనాడింది ఓ ఇన్నింగ్స్ మాత్రమే. కానీ టీ20ల్లో మాత్రం మాస్టర్‌ను అయ్యా. అందుకే ఇందులో ఆడడం నాకెంతో బాగుంది. అయినా జీవితంలో ఏది రాసిపెట్టి ఉంటే అదే జరుగుతుంది. దాదాపు పదేళ్లు ముంబై తరఫున నేను రంజీ ట్రోఫీ ఆడిన విషయం మరువరాదు. వన్డేల్లోనూ ఉత్తమంగా ఆడేందుకు ప్రయత్నించినా కుదరలేదు. టీ20లకు మాత్రం నా ఆట సరిపోయింది. అలాగని నాకు టెస్టుల్లో ఆడేందుకు ఆసక్తిలేదని కాదు. టెస్ట్ చాన్స్ వస్తే ఎవరైనా కాదంటారా' అని బీసీసీఐ నమన్ అవార్డుల్లో రెండేళ్లుగా జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్‌ను ఇటీవల వరల్డ్‌కప్‌నకు ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. కానీ అప్పటికి ఏడాదిగా జట్టుతో పాటే ఉంటున్న కీపర్ జితేశ్ శర్మను సెలెక్టర్లు పక్కనబెట్టారు. ఇదే విషయమై సూర్య స్పందిస్తూ.. 'టాపార్డర్‌లో ఎటాకింగ్ బ్యాటర్ ఉండాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరింది. అలాగే కుడి-ఎడమ కాంబినేషన్ కూడా కావాలనుకుంది. అందుకే ఇషాన్ వైపు మొగ్గు చూపడంతో జితేశ్ స్థానం కోల్పోయాడు' అని వివరించాడు. దేశంలో నైపుణ్యం కలిగిన యువ క్రికెటర్లకు కొదవ లేదని, వీరితో పరిమిత ఓవర్లలో రెండు, మూడు జట్లను కూడా తయారు చేయవచ్చని సూర్య అన్నాడు. దేశవాళీలతో పాటు ఐపీఎల్ కారణంగా వర్ధమాన ఆటగాళ్ల ఆట గణనీయంగా మెరుగుపడిందని అభిప్రాయపడ్డాడు. ప్రతీ ఏడాది ఐపీఎల్ ద్వారా యువ క్రికెటర్లు వెలుగులోకి వస్తున్న విషయాన్ని గుర్తుచేశాడు. అందుకే అపార నైపుణ్యం కలిగిన వీరితో రెండు, మూడు జట్లను కూడా ఎంపిక చేసి ఆడించే వెసులుబాటు ఉందన్నాడు.

## రెండో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఘన విజయం




హామిల్టన్ వేదికగా కివీస్, సౌతాఫ్రికా మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. టాస్ ఓడిన కివీస్.. సౌతాఫ్రికా ఆహ్వానం మేరకు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. టాపార్డర్‌లో ఓపెనర్ టామ్ లాథమ్ (11), వన్‌డౌన్ బ్యాటర్ టిమ్ రాబిన్సన్ (1) నిరాశపర్చారు. అయితే మరో ఓపెనర్ డెవాన్ కాన్వే అర్ధ శతకం (60)తో రాణించాడు. మిగిలిన వారిలో నిక్ కెలీ ( 21), కెప్టెన్ మిచెల్ శాంట్నర్ ( 21)(వీఈఎష్ట్రవశ్రీశ్రీ ఝుత్‌అవతీ) ఫర్వాలేదనిపించారు. చివర్లో కోల్ మెకాంచి (12 బంతుల్లో 18), జోష్ క్లార్క్‌సన్ (9 బంతుల్లో 26) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. ఇక సఫారీ బౌలర్లలో వియాన్ ముల్డర్ రెండు వికెట్లు సాధించగా.. గెరాల్డ్ కోయెట్జి, ఒట్నీల్ బార్ట్‌మాన్, కెప్టెన్ కేశవ్ మహరాజ్, జార్జ్ లిండే తలా ఒక వికెట్ తీశారు. ఇక 176 పరుగుల టార్గెట్ తో బ్యాటింగ్ కు దిగిన దక్షిణాఫ్రికా జట్టుకు ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్లు కొన్నోర్ ఎస్తురూజెన్ (8), వియాన్ ముల్డర్ (16) స్వల్ప పరుగులకే పెవిలియన్ చేరారు. వన్‌డౌన్‌లో వచ్చిన టోనీ జార్జి (1) కూడా నిరాశపరిచాడు. మిగిలిన వారిలో జార్జ్ లిండే 12 బంతుల్లో 33 పరుగులు చేసి.. విజయం కోసం కాసేపు పోరాడాడు. రూబిన్ హెర్మాన్ (19) కూడా ఫర్వాలేదనిపించాడు. మిగిలిన వారంతా చేతులెత్తేయడంతో 15.3 ఓవర్లలో 107 పరుగులకే సౌతాఫ్రికా ఆలౌటైంది. కివీస్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్, బెన్ సియర్స్ చెరో మూడు వికెట్లతో సౌతాఫ్రికా(రాశీబ్ష్ట్ర ౘటతీఱఎ) ఓటమిని శాసించారు. అలానే శాంట్నర్ రెండు, మెకాంచి, జేమ్స్ నీషమ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో న్యూజిలాండ్ సిరీస్‌ను ప్రస్తుతానికి 1-1తో సమం చేసింది. తొలి టీ20లో సౌతాఫ్రికా గెలిచిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా మూడో టీ20 జరగనుంది.




## తమిళనాడులోని అన్ని ప్రాంతాల్లో రిలీజ్ కానున్న
# 'ఉస్తాద్ భగత్ సింగ్'



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. హరీశ్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోనూ భారీ ఎత్తున విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు.

ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా తమిళనాడు పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ ఏజీఎస్ సినిమాస్ దక్కించుకుంది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పవన్ కల్యాణ్ సినిమాను తమిళనాడు వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించడంతో అక్కడి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.

# విజయ్, త్రిషలపై వార్తలు.. ఖుష్బూ స్పందన



విజయ్, త్రిషల గురించి కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలపై సినీనటి ఖుష్బూ స్పందించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో త్రిష గురించి ఆమె మాట్లాడుతూ .... ఆమె చాలా హుందాగా ఉంటుందన్నారు. తెలియని వారు చేసే కామెంట్స్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. "ప్రస్తుతం మనం ఎలాంటి రోజుల్లో ఉన్నామంటే.. ఎవరైనా తుమ్మినా వాళ్లను నిందించేస్తున్నాం. ఇది చాలా దురదృష్టకరం. నాకు విజయ్, త్రిష ఇద్దరూ బాగా తెలుసు. ముఖ్యంగా త్రిష నాకు చాలా సన్నిహితురాలు. నాకు తెలిసిన గొప్ప మహిళల్లో తను ఒకరు. ఎంతో మృదుస్వభావి" అని చెప్పారు. ఇక రూమర్స్ సృష్టించేవారు, ఫొటో గ్రాఫర్లను ఉద్దేశించి ఖుష్బూ మాట్లాడుతూ .... "ఈ ఫొటోగ్రాఫర్లు ప్రతిచోటా సెలబ్రిటీల వెనకపడటం అనేది ముంబయిలో చూస్తుంటాం. ఇప్పుడు ఆ సంస్కృతి ఇక్కడ (చెన్నై) కూడా మొదలవడం బాధాకరం. ఎదుటివారి వ్యక్తిగత జీవితాల గురించి కామెంట్స్ చేసేవారు.. తమ సమస్యల కంటే ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికే ఇష్టపడతారు. ఒకరి గురించి తప్పుగా మాట్లాడుతూ వారు ఒక రకమైన పైశాచిక ఆనందాన్ని పొందుతుంటారు. ఇలాంటి కామెంట్స్ చేసేవారిలో 99.9 శాతం మంది ఎవరో కూడా మనకు తెలియదు. అలాంటివారు చేసే వ్యాఖ్యలకు స్పందిస్తూ మన విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని నేను భావిస్తున్నాను" అని ఖుష్బూ అన్నారు.

ఇటీవల ఖుష్బూ విజయ్, త్రిషల గురించి మాట్లాడారు. "ఈ వ్యవహారంతో ప్రజలకు ఏం సంబంధం ఉందో నాకు అర్థం కావట్లేదు. అది వారి వ్యక్తిగతం. దీనిని ఎందుకు పెద్ద విషయంలా చూస్తున్నారు ?" అని పేర్కొన్నారు. ఈ కాంట్రవర్సీ విజయ్ పొలిటికల్ కెరీర్‌పై ప్రభావం చూపుతుందా? అని అడగ్గా.. "ఎవరికి ? ఎందుకు ఓటు వేయాలో ప్రజలకు బాగా తెలుసు. అయినా వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు" అని అన్నారు.




# బాలీవుడ్ అశ్లీలతపై కఠిన నియంత్రణ ఉండాల్సిందే: కంగనా రనౌత్



బాలీవుడ్ తన స్థాయిని దిగజార్చుకుంటూ, ప్రేక్షకులను ఆకర్షించడం కోసం అన్ని హద్దులను దాటేస్తోందని స్టార్ హీరోయిన్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శించారు. చౌకబారు ట్రిక్కులతో అశ్లీలతను ప్రోత్సహిస్తున్న సినీ పరిశ్రమ తీరును దేశమంతా ఛీకొడుతున్నా, వారికి ఏమాత్రం సిగ్గు ఉన్నట్లు అనిపించడం లేదని ఆమె మండిపడ్డారు. ఇలాంటి అభ్యంతరకర ప్రదర్శనలకు చెక్ పెట్టాలంటే ప్రభుత్వం బాలీవుడ్‌పై కచ్చితంగా కఠినమైన నియంత్రణ విధించాలని, అప్పుడే ఈ అశ్లీలతకు ఎండ్ కార్డ్ పడుతుందని కంగనా గట్టిగా నొక్కి చెప్పారు. అసలు ఈ వివాదం 'కేడీ.. ది డెవిల్' అనే కన్నడ చిత్రం కోసం రూపొందించిన హిందీ పాటతో మొదలైంది. ఈ పాటలోని సాహిత్యం పచ్చిగా, డబుల్ మీనింగ్ డైలాగులతో ఉందంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. కేవలం సాధారణ ప్రజలే కాకుండా, ప్రముఖ గాయకుడు అర్మాన్ మాలిక్ కూడా కమర్షియల్ సాంగ్ రైటింగ్ ఇంతగా దిగజారిపోవడం బాధాకరమంటూ తన అసహనాన్ని వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో నోరా ఫతేహి నటించిన ఈ పాటను ఇప్పటికే యూట్యూబ్ నుంచి తొలగించారు. అంతే కాకుండా, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని చిత్ర బృందానికి నోటీసులు జారీ చేయడం గమనార్హం.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**